సీరియల్

అగ్ని క్షిపం

ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

దిక్కుతోచక అరుస్తున్నారు ప్రయాణీకులంతా....
కిందికి దూసుకుపోతున్నట్టు అనిపిస్తోంది విమానం.

అరుస్తున్నారు. ఆర్తనాదాలు చేస్తున్నారు.

అందరి కళ్ళలోనూ మృత్యుభయం.

"బయటకు దూకండి. ప్రాణాలు దక్కితే దక్కుతాయి. సముద్రం మీదనించే వెళుతోంది ప్లేన్."

ఏర్ హోస్టెస్ గొంతుచించుకొని అరుస్తోంది.

ఎవరో ఎంట్రెన్స్ డోర్ ఓపెన్ చేశారు.

ఒక్కసారిగా గాలి లోపలకు దూసుకువచ్చింది. మంటలు మరింత ఎత్తుకు పైకిలేచాయి.

కొంతమందిలో చావు తెగింపు వచ్చింది.

అంతే.

క్షణాల్లో బయటకు దూకేశారు—చీకట్లోకి కొంత

వరకు మంటల వెలుగు పడుతోంది.

"ఓ గాడ్ .... సేవ్ మీ .... సేవ్ మీ ...."

ముసలాయన అరుస్తున్నాడు.

ఆయన ఎక్కడ వున్నాడో ఎవ్వరికీ తెలీదు.

కొంతమంది భయంతో స్పృహ తప్పిపోయారు.

"స్టెల్లా" అరుస్తున్నాడు భారత్ ....

ఎక్కడినుంచో "భారత్" అంటోంది స్టెల్లా.

విమానం దొంగల్లో ఒకడు చచ్చిపోయాడు. అందాల సుందరి తర్వాత. మిగిలిన ముగ్గురు యెలా వున్నారో తెలీదు.

నాలుకలు చాచుకుని పైకి లేస్తున్నాయి మంటలు. మండిపోతోంది విమానం.

"భారత్ .... బయటకు దూకెయ్. మంటలు లోపలకు వస్తున్నాయ్ .... నేనూ దూకుతాను. నన్ను పట్టుకో .... ఇద్దరం ఒకేసారి దూకుదాం."

స్టెల్లా దగ్గరనించే అరుస్తున్నట్టు అనిపించింది.

"వద్దు .... స్టెల్లా మనం బతకటం అసాధ్యం .... సముద్రంలో దూకినా మనకు చావు తప్పదు. మన జీవితాలు ఈ ఆకాశంలోనే అంతమవుతాయి. ఇది కెరోన్ పెట్టిన శాపం."

అరిచాడు భారత్ లోపలకు దూసుకుని వచ్చి కొండ చిలువలా చుట్టుకుంటున్న ఆ గాలి హోరులో ....

"డర్టీ కెరోన్, యూ ఆర్ ఎ సెంటిమెంటల్ ఫూల్! ఉయ్ మస్ట్ సేవ్ అవర్ లైవ్స్ .... నాకు ఈత వొచ్చు. సముద్రంలో దూకితే నిన్ను నేను రక్షిస్తాను. క్విక్ .... జంప్ ...."

అలా అంటూనే మనుషులను నెట్టుకుంటూ వచ్చి

భారత్ చేతిని పట్టుకుంది సెల్లా.

"వద్దు.... నేను దూకను....ఇంకో క్షణంలో ఈ ప్లేన్ సముద్రంలోనే కూలిపోతుంది."

"భారత్ మూర్ఖంగా మాట్లాడకు...ఈ ప్లేన్ సముద్రంలో కూలిపోతుందో గాల్లోనే పేలిపోతుందో మనకు తెలీదు. నా మాట విను. క్విక్....ఇదంతా ఈ ఇడియట్స్ ప్లేన్ రాబర్స్ వల్లనే జరిగింది....ఇంకో ముగ్గురు వెధవలు బయటకు దూకినట్టున్నారు. దొరికితే షూట్ చేసేదాన్ని" అన్నది.

సెకన్లు గడిచాయి.

లోపలకు దూసుకు వస్తున్న చల్లటి గాలి కత్తిలా కోస్తూ బయటకు ఈడ్చుకు వెళుతోంది గొలుసులు వేసి బలవంతంగా లాకెళుతున్నట్టు.

హాహాకారాలు చెలరేగుతున్నాయి.

బయటకు దూకే ధైర్యంలేనివాళ్ళు దేవుడ్ని ప్రార్థిస్తూ లోపలే వూగిపోతూ అరుస్తున్నారు.

మృత్యు భయంతో కేకలు పెడుతున్నారు.

ఇంకొక్క క్షణం....

సర్రున దూసుకుపోయింది ప్లేన్ బాణంలా.

సెకన్లలో పెద్ద శబ్దంతో కూలిపోయింది.

* * *

సెల్లా చిన్నగా అటూ ఇటూ కదిలింది. కదిలింది కాని ఆమె స్పృహలోకి వచ్చి కదల్లేదు. కొంచెం సేపటి తర్వాత స్పృహలోకి వచ్చి కళ్ళు తెరిచేందుకు ప్రయత్నించింది.

కళ్ళు తెరిచి వెంటనే మళ్ళీ మూసుకున్నది. ఆమె కళ్ళలోకి సూదులతో గుచ్చుతున్నట్టుగా సూర్యుడి కిర

ణాలు పడుతున్నాయి. అందుకే కళ్ళు తెరవలేక పోయింది.

అప్పుడే ఆమెకు అంతా ఒక్కసారిగా గుర్తుకువచ్చి అంతులేని ఆశ్చర్యానికి లోనయ్యింది.

జరిగిపోయినదంతా మెదడులో గిర్రున తిరిగింది.

తను ఇంకా బతికే వున్నదా?

ఇదెలా సాధ్యం?

అప్పుడు చటుక్కున లేచి కూర్చుని కళ్ళు తెరిచింది.

ఎదురుగా అంతా ఇసుక. ఇసుకలో అక్కడక్కడ దగ్గరగానే పెరిగిన అంతగా ఎత్తులేని ముళ్ళ పొదలు. వాటి మధ్యలో భూమిలోనించి పొడుచుకు వచ్చినట్టున్న పెద్ద పెద్ద చెట్లు.

ఆశ్చర్యం కలిగింది స్టెల్లాకు. అయితే తను ఇంకా ప్రాణాలతో వున్నదా?

అవును. సందేహంలేదు.

ఒళ్ళంతా సన్నని ముళ్ళు గీరుకుపోయి మంటగా వున్నది.

తలతిప్పి పక్కకు చూసేసరికి సగం పైగా కాలి పోయిన విమానం ఓ పెద్ద పొదలోకి దూసుకుపోయి కన పడింది.

అప్పుడు స్టెల్లాకు చప్పున భారత్ గుర్తుకు వచ్చాడు.

అవును. భారత్ యేడీ?

ఏమిటి?

ఎవ్వరూ కనపడరేం??

ఒక్కసారి స్టెల్లాకు విమానం కూలిపోవటానికి ముందు సంఘటనలన్నీ నెమరుకు వచ్చాయి.

ప్లేన్ కూలిపోతున్నప్పుడు ఎర్రగా పైకి లేచిన విక్రతంగా వున్న మంటలు....అంతా చావు భయంతో చేసిన హాహాకారాలు ఆమెకు తిరిగి కనిపించాయి—వినిపించాయి.

ఐతే—మిగిలిన వారంతా మరణించారా?

మంటల్లో పడి మాడిపోయారా?

చివరకు తన భారత్ కూడా....

స్టెల్లా ఉలిక్కిపడింది. చివాలున లేచి నిలబడింది. ఆమె శరీరానికి అంటుకునివున్న ఇసుక లేచినిలబడటంతో కిందికి రాలింది.

వెచ్చటి గాలి విసురుగా వీస్తోంది.

దూరంగా ఎక్కడో వుంది పెద్ద చెట్టు.... ఎండ కాల్చేస్తున్నట్టుగా వుంది.

రెండడుగులు వెనక్కు వేసింది.

ఆమె గుండె ఒక్కసారి వేగంగా కొట్టుకుంది. భారత్ బోర్లాపడి వున్నాడు ఇసుకలో. అతని తలనిండా ఇసుక కొట్టుకుని వుంది. కొంచెం దూరంలో అతని సూట్కేసు కూడా వుంది.

వేగంగా అతని దగ్గరకు వెళ్ళి మోకాళ్ళమీద వంగి కూర్చుని అతని వీపుమీద చెయ్యి వేసింది.

"భారత్....భారత్!"

అతను పలకలేదు.

బతికే వున్నాడా? అనుమాన మొచ్చింది.

పరిశీలనగా చూసింది. అతడి వీపు కదులుతోంది చిన్నగా.

మైగాడ్....ఫర్వాలేదు.

అతడి భుజంమీద రెండు చేతులతో కుదుపుతూ

"భారత్" అని మళ్ళీ పిల్చింది.

విసురుగా వీస్తోన్న గాలికి ఇసుకఎగిరి వచ్చి ఆమె కళ్ళలో పడుతోంది.

కళ్ళు చిట్లించి అతడినే చూస్తూ మరి కొన్నిసార్లు పిల్చింది.

కొంచెం సేపటి తర్వాత ఆమె ప్రయత్నం ఫలించింది. భారత్ చిన్నగా కదిలి మరో నిమిషం తర్వాత కళ్ళు తెరిచాడు.

ఎదురుగా స్టెల్లా కనపడగానే గుర్తు పట్టనట్టుగా చూశాడు.

"భారత్ .... నేను స్టెల్లాని."

కొన్ని నిముషాల తర్వాత భారత్ ఈ లోకంలోకి వచ్చాడు.

నెమ్మదిగా లేచి కూర్చుని "స్టెల్లా! మనం బతికే వున్నామా?" అనడిగాడు.

స్టెల్లా నవ్వి "నాకూ మొదట్లో యిలాంటి సందేహమే వచ్చింది. కాని మనం నిజంగానే బతికివున్నాం. అందుకు నిదర్శనం...." అంటూ చటుక్కున అతనిమీదకు వంగి భారత్ పెదవులమీద ముద్దు పెట్టుకుంది.

ఊహించని ఆ చర్యకు అతను ఉక్కిరి బిక్కిరయ్యాడు.

తర్వాత "నిజమే. మనం బతికే వున్నాం? కాని నాకంతా ఆశ్చర్యంగా వుంది. మన ప్లేన్ సముద్రంలో కూలి పోలేదా?" అన్నాడు.

"లేదు. ఈ దీవిలో కూలిపోయింది. అలా జరగడం వల్లనే మనం బతికి బయటపడ్డాం."

"ఐనా ప్లేన్ కాలిపోకుండా వుందా?"

"కాలిపోలేదు. మూసుకురావటంతో ఈ పక్కనే వున్న పెద్ద పొదలోకి మూసుకుని పోయింది."

ఇద్దరూ లేచి నిలబడ్డారు.

భారత్ తన సూట్కేసు అక్కడే పడివున్నందుకు సంతోషపడ్డాడు.

"శైలా! నిజంగా నేనెంతో భయపడిపోయాను. ఎందుకంటావా కెరోన్ శాపం నిజమవుతుందని-కాని కాలేదు. మనం ప్రాణాలతోనే వున్నాం. లక్షలు విలువచేసే వజ్రాలు కూడా మన దగ్గరే వున్నాయి. ఇక మనం అసలు ఈ దీవి యేమిటో, ఇక్కడినించి బయటపడటం ఎలాగో ఆలోచించాలి" అన్నాడు భారత్.

"అవును. ఇదిగో ప్లేన్. చాలావరకు కాలిపోయింది. కాని పూర్తిగా యెందుకు కాలిపోలేదో నాకు తెలీటం లేదు" శైలా అంది. అతడి పక్కగా అడుగులు వేస్తూ—

ఒక్క నిముషం ఆగిపోయాడు భారత్.

ఇసుకను కాలితో తవ్వాడు. అడుగున ఇసుక తడిగా వుంది.

అతను నవ్వి "ప్లేన్ పూర్తిగా ఎందుకు కాలిపోలేదో ఇప్పుడు అర్థమయ్యింది. ప్లేన్ కూలిపోయే సమయానికే యీ దీవిలో పెద్ద వర్షం మొదలయి వుంటుంది" అన్నాడు.

"అవును. అందుకే మన బట్టలనిండా, వంటినిండా బాగా ఇసుక కొట్టుకుపోయింది."

"ఇంతకీ ఈ ప్రమాదంనించి మనిద్దరమేనా ప్రాణాలతో బయటపడింది?"

"కాకపోవచ్చు. ఇంకా చుట్టూవున్న ఆ పొదల్లో

వెతకాలి. మనలాగే యెవరైనా బయటపడివుండవచ్చు. ప్లేన్ కూలిపోయేటప్పుడు ఇంకొంతమంది అందులో వున్నారు కదా!"

"పద. అలా చూద్దాం...."

సూట్కేసును ఎడమచేతిలోకి మార్చుకుంటూ ముందుకు కదిలాడు భారత్.

పొదలో వాళ్ళ వెనకవైపు యేదో అలికిడయ్యింది. ఐతే ముందు నడుస్తున్న యిద్దరూ అలికిడిని గమనించలేక పోయారు.

* * *

"మర్యాదగా చేతులెత్తండి."

ఉలిక్కిపడ్డారిద్దరూ.

చేతులెత్తకుండానే వెనక్కు తిరగబోయారు.

"వద్దు. ప్రమాదం.... చేతులెత్తిన తర్వాతనే ఎదురుగా తిరగండి."

మళ్ళీ వినపడింది ఆ హెచ్చరిక.

నిజంగా ఆశ్చర్యం!

ఎవరు?

ఆ మనిషి ఎవరు?

ప్లేన్ లోనించి బయటపడిన మనిషేనా?

అయితే ఇప్పటివరకూ ఎక్కడ వున్నాడు?

తమకంటే ముందుగానే స్పృహలోకి వచ్చాడా? ఐతే ఎందుకు బయటపడలేదు.

"ఏమిటి ఆలస్యం? నా చేతిలో పిస్తోలు వుంది. క్షణం ఆలస్యమైతే పేలుతుంది."

ఆ కంఠస్వరం ఇంతకు ముందు ఎక్కడో విన్నట్టుగా అనిపించింది ఇద్దరికీ. ఎక్కడ విన్నారు?

ఇలా అనుకుంటూ చేతులెత్తి వెనక్కి తిరిగి ఒకేసారి ఎంతో ఆశ్చర్యపడ్డారు.

ఎదురుగా పాంకీల్ నిలబడి వున్నాడు. అతని చేతిలో పిస్తోలు వాళ్ళకే గురిపెట్టబడి వుంది. అతను బతికి వుంటాడని వాళ్ళు ఏమాత్రం వూహించనే లేదు.

వికృతంగా నవ్వాడు పాంకీల్.

నవ్వు ఆపి ఒక్క నిముషం "ఆశ్చర్యంగా వుందా?? ఈ పాంకీల్ మృత్యుంజయుడు. మీ ఇద్దరూ మీ దగ్గర వున్న లక్షలు విలువ చేసే వజ్రాల గురించి మాట్లాడుకోవటం పొదలో మీకు కొంచెం దూరంలో పడివున్న నేను స్పృహ వచ్చి విన్నాను. ముందు మీ దగ్గర వున్న ఆ సూట్కేసును ఇలా పడెయ్యండి" అన్నాడు పిస్తోలును తొణక్కుండా పట్టుకుని.

భారత్ తలతిప్పి సెల్లాకేసి చూశాడు.

సెల్లా చూపులు నిశ్చలంగా వున్నాయి యెదురుగా వున్న పాంకీల్ మీద—అతని చేతిలో వున్న పిస్తోలు మీద.

ఎదురుచూడని ప్రమాదం.

పాంకీల్ ఇలా శనిలా మళ్లీ తగులుతాడని అనుకోలేదు.

ఇప్పుడేమిటి చెయ్యటం?

ఇవ్వకపోతే జరిగేదేమిటి? సెల్లా ఏమాలోచిస్తోంది. మళ్ళీ అదే టెన్షన్.

గాలి రివ్వున వీస్తోంది.

సెకన్లు....నిముషాలు....

అసహనంగా వుంది.

సూట్కేసు భారత్ కాళ్ళదగ్గరే వున్నది.

షాంకీల్ ఇంకోసారి నవ్వాడు.

"సరే.... నేనే అక్కడికి వస్తాను. మీరు నిరాయుధులు. నా చేతిలో పిస్తోలు వుంది" అంటూ ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూ కొంచెం దగ్గరగా వచ్చాడు.

స్టెల్లా వూపిరి బిగబట్టి ఆలోచిస్తోంది.

షాంకీల్ చేతిలో పిస్తోలు ఆకలిగా చూస్తోంది.

రెండడుగుల దూరంలోకివచ్చి "సూట్కేసు ముందుకు నెట్టండి" అన్నాడు.

"భారత్! ఈ వజ్రాల గురించి ప్రాణాలు పోగొట్టుకోవటం నా కిష్టంలేదు. సూట్కేసును నేనిస్తాను" అన్నది స్టెల్లా.

తల వూపాడు భారత్.

స్టెల్లా అలా అనడంలో యేదో మర్మం వుందని అతని నమ్మకం.

సూట్కేసు తియ్యటాని కన్నట్టు ముందుకు వంగింది స్టెల్లా. పూర్తిగా వంగలేదు. వంగుతూనే బాణంలా ముందుకు దూసుకుపోయింది.

తలతో షాంకీల్ గుండెలమీద గట్టిగా కుమ్మింది.

కెవ్వున అరిచాడతను బాధతో.

చేతిలో పిస్తోలు ఢామ్మని పేలింది. అతను యెగిరి వెనక్కు పడుతున్నప్పుడు. ఆ చప్పుడుకు దూరంగా వున్న చెట్టుమీది పక్షులు గోలగా అరుస్తూ పైకి లేచాయి.

కిందపడిన షాంకీల్ ను స్టెల్లా లేవనివ్వలేదు. కాలితో అతడి మొహంమీద శక్తికొద్దీ తన్నింది.

షాంకీల్ రెండు పళ్ళు విరిగాయి.

ఆ పోరాటంలో భారత్ కలిగించుకోలేదు. స్టెల్లా శక్తి సామర్థ్యాలు అతనికి బాగా తెలుసు. షాంకీల్

లాంటి నలుగురు మనుషులను ఐదు నిముషాల్లో చిత్తు చేయగలదు.

షాంకీల్ లేవటానికి ప్రయత్నం చేస్తున్నాడు. కాని సెల్లా అతనికి అవకాశం యివ్వకుండా అతన్ని బంతిలా దొర్లిస్తోంది.

ఐదు నిముషాల్లో షాంకీల్ ఇక కదల్లేని స్థితికి వచ్చేశాడు.

"భారత్ ....ఇప్పుడు ఈ వెధవ మనకు బంది...." అంటూ పక్కనే పొదలో వున్న చెట్టుతీగలను తెంపి వాటితో షాంకీల్ చేతులు వెనక్కు విరిచి కట్టేసింది.

అక్కడికి కొంచెం దూరంలో పడిన అతని రివాల్వర్ను తీసి భారత్కు యిచ్చింది. షాంకీల్ను లేవదీసి నిలబెట్టింది.

* * *

ముగ్గురూ నడక మొదలుపెట్టారు.

వాళ్ళకు అతి సమీపంలోనే ఓ పొద కనపడింది.

ఆ పొద పక్కనే పడివున్న మనుషులను చూడగానే వాళ్ళకు ఆశ్చర్యం, సంతోషం కలిగాయి.

"ఓ గాడ్ ....మనకు తోడుగా మరికొంతమంది మనుషులు కూడా బతికే వున్నారు" అన్నది సెల్లా వాళ్ళ దగ్గరకు పరుగెత్తి.

మొత్తం పన్నెండుమంది. అందులో ముగ్గురు స్త్రీలు-ఓ ముసలాయన కూడా వున్నాడు.

సెల్లా—భారత్ ఇద్దరూ ఓ పావుగంట సేపు శ్రమపడి అందరికీ స్పృహ తెప్పించారు.

ఒకరినొకరు చూసుకుని అంతా ప్రాణాలతో వున్నందుకు సంతోషపడ్డారు వాళ్ళంతా.

వాళ్ళకు స్పృహ వస్తుంటే షాంకీల్ కు ప్రాణాలు పోతున్నంత భయమేసింది. వాళ్ళంతా లేస్తే తనని బతకనిస్తారా?

అతని భయం నిజమే అయ్యింది.

ఆశ్చర్యం నించి తేరుకున్నాక వాళ్ళు షాంకీల్ ను గమనించారు. అప్పటివరకు అతను పాద పక్కగా నక్కి నిలబడ్డాడు.

ముందుగా ఓ నలభై యేళ్ళ మనిషి షాంకీల్ ను చూసి "యూ ఇడియట్....నువ్వింకా బతికే వున్నావా?" అన్నాడు.

అప్పుడే మిగిలిన వాళ్ళంతా అతన్ని చూశారు.

సెలా కలిగించుకొని అన్నది "బతికివుండటమే కాదు. పిస్టోలుతో మా యిద్దరినీ వెనుక నుంచి బెదిరించాడు చంపుతానని....యెలాగో వాడ్ని దెబ్బతీసి బంధించాము."

"అసలు ఈ ప్లేన్ రాబర్స్ వల్లనే మనం యిన్ని కష్టాలు పడవలసి వచ్చింది. ఈ రోగ్ ను బతకనివ్వకూడదు" అన్నాడు ముసలాయన.

అంతే. అంతా ఒక్కసారిగా ముందుకు నూకారు.

"వద్దు. నన్ను చంపొద్దు...నేనూ మీలాంటి మనిషినే....ప్లీజ్! చంపొద్దు."

వెనక్కు నడుస్తూ ప్రాధేయపడ్డాడు.

వాళ్ళు వినలేదు.

వాళ్ళ ఉద్రేకం తారస్థాయిలో వుంది.

పిస్టోళ్ళతో బెదిరించి నిర్దాక్షిణ్యంగా తమ దగ్గర వున్న విలువైన వస్తువుల నన్నింటినీ వల్చుకున్న మనిషి యిప్పుడు నిస్సహాయంగా ఒంటరిగా తమ యెదురుగానే

వున్నాడు.

అలాంటి మనిషిని ప్రాణాలతో వదిలెయ్యటమా?

సాధ్యమేనా?

స్త్రీలుకూడా పాంకీల్ అంతు చూడటానికి ముందుకు వచ్చారు.

పాంకీల్ భయంతో వణికిపోయాడు. ఆ భయంతో అతని కళ్ళకు మేకులు కొట్టినట్టుగా అక్కడినించి కద లేకపోయాడు.

ఒక్కసారిగా అందరూ అతనిమీద పడేసరికి కెవ్వు మన్నాడు. తర్వాత "వద్దు....వద్దు....నన్ను చంపొద్దు... దయతో వదలండి....ప్లీజ్ ....సేవ్ మీ" దీనంగా అరిచాడు.

అతన్ని చేతికందినట్టుగా కొడుతున్నారు వాళ్ళు.

సెల్లా—భారత్ ఒకరినొకరు చూసుకున్నారు.

"నాకు జాలిగా వుంది. ఇంతమంది మధ్య ఒక్కడు. ఎముకలుకూడా మిగలవు" అన్నాడు భారత్.

"ఆపండి" అరిచింది సెల్లా.

ఒక్కసారి అంతా ఆగిపోయి పాంకీల్‌ను వదిలారు.

"డియర్ ఫ్రెండ్స్....ఈ వెధవను చంపినందువల్ల ఇప్పుడు మనకు ప్రయోజనం ఏమీ లేదు. కేవలం కసి తీరుతుంది. అంతేకదా! అలా కాకుండా ఇతన్ని ప్రాణాలతో వుంచినందువల్ల మనకు ఒక ఉపయోగం వుంది. మనందరికీ ఈ పాంకీల్ సేవకుడుగా ఉపయోగపడతాడు. ఈ దోపిడీ కొంగకు ఇదే తగిన శిక్ష. ఇందుకు మీరేమంటారు?"

వాళ్ళు కొంచెంసేపు ఒకరినొకరు చూసుకున్నారు. సెల్లా ఆలోచన వాళ్ళకు నచ్చినట్టుంది.

అందుకే "నీ యిష్టం" అన్నారు.

"థాంక్ యూ. ఇక ఈ ఒప్పందానికి షాంకీల్ ఒప్పుకుంటాడో లేదో తెలియజెయ్యాలి. ఇందులో బలవంతం ఏదీ లేదు. ఒక వేళ మనందరికీ అతడు సేవకుడుగా వుండటాని ఒప్పుకోని పక్షంలో అతను మనకు చేసిన ద్రోహానికి ఈ క్షణంలోనే అందరం కలిసి చంపేస్తాం."

"వద్దు....మీ షరతుకు నేను ఒప్పుకుంటున్నాను. నేను మీ బానిసను. నన్ను మీరు ఎలాంటి పనులకైనా ఉపయోగించుకోవచ్చు. దయచేసి నన్ను ప్రాణాలతో వుంచండి" అన్నాడు.

"గుడ్. ఇక నీ ప్రాణాలకు ఎలాంటి భయం లేదు మావల్ల. కాని నువ్వు దొంగవి. నీలో దొంగబుద్ధి అంత సులభంగా పోదు. మేమందరం ఏమరుపాటుగా వున్న సమయంలో మమ్మల్ని దెబ్బతీసి మా వస్తువులను తీసుకుని పారిపోయే ప్రయత్నం చేస్తే నువ్వు ఎక్కడ దాగినా నిన్ను వేటాడి చంపి ఇక్కడే సమాధి చేస్తాను" అన్నది స్టెల్లా.

"అంత మాటలు వద్దు. నన్ను నమ్మండి. ఈ కట్లు తీసెయ్యండి. చేతులు వొరుసుకుపోయి మండుతున్నాయి" అన్నాడు బాధగా.

షాంకీల్ గొంతుకూడా మారిపోయింది బాధతో.

నవ్వుతూ స్టెల్లా అతని వెనక్కు వెళ్ళి తీగ కట్లు వూడదీసింది.

వెంటనే రెండు చేతులనూ ముందుకు తెప్పించి ఆప్యాయంగా చూసుకుంటూ "థాంక్ యూ" అన్నాడు షాంకీల్.

తర్వాత జేబులోనించి కర్చీఫ్ బయటకుతీసి నోటికి అంటిన రక్తాన్ని తుడుచుకున్నాడు.

మళ్ళీ అంతా విమానం కూలిపోయిన పొద దగ్గరకు నడిచారు. కొంచెమే బయటకు అగుపడుతోంది ప్లేన్.

దానికి దగ్గర్లో, పొదలో కొన్ని లగేజీలు దొరికాయి వాళ్ళకు. ఎవరికి దొరికినవి వాళ్ళు తీసుకున్నారు.

ఇక అక్కడ విలువైనవేమీ లేవని నిర్ధారణ చేసుకున్న తర్వాత ఇవతలికి వచ్చారు.

అప్పుడు తెలిసింది అందరికి ఆకలిగురించి.

* * *

“ఎవరి దగ్గరైనా ఏదైనా ఫుడ్ వుందా?” అడిగింది స్టెల్లా.

అంతా లేదన్నారు.

ఓ స్త్రీ తన దగ్గర వున్న బ్యాగ్ తీసి అందులోనించి రెండు బిస్కెట్ ప్యాకెట్లు బయటకు తీసింది. నిజానికి ఆ రెండూ ఒక్కమనిషికి కూడా సరిపోవు. అంతమందికి ఎలా సరిపోతాయి.

అప్పటికే ముందుకు అడుగువేసే శక్తికూడా లేకుండా వున్న ముసలాయనకు ఆ రెండు ప్యాకెట్లనూ ఇచ్చేసింది స్టెల్లా.

గబగబా వాటిని తినేశాడాయన.

“దాహంగా వుంది నీళ్ళు” అన్నాడు.

అక్కడ నీళ్ళు వున్న జాడ లేవీ కనిపించలేదు.

“ఇక్కడ ఎండ మాడుస్తోంది. ముందు మనం ఆ చెట్టుకిందికి వెళ్ళి నిలబడదాం” అన్నాడు భారత్.

ఓ ఇద్దరి లగేజీలను పాంకీల్ పట్టుకున్నాడు.

అంతా నీరసంగా నడిచి ఆ పెద్ద చెట్టు కిందకు వెళ్ళారు. చాలా ఎత్తుగా వుంది ఆ చెట్టు. వెడల్పుగా వున్నాయి ఆకులు. కాని దానికి ఒక్క కాయకూడా

కనపడలేదు.

అక్కడ వున్న యెవ్వరూ ఇంతకుముందు అలాంటి చెట్టును చూడలేదు.

గాలికి విసురుగా కదులుతూ చిత్రమైన ధ్వనిని పుట్టిస్తోంది.

"ముందు మనకు ఆహారం కావాలి. తర్వాత నీళ్ళు కావాలి. ఈ రెండూ దొరికిన తర్వాత మనం ఈ దీవి నించి బయటపడే మార్గంకోసం ప్రయత్నం చెయ్యాలి. ఈ దీవి పేరేమిటో మనకు తెలీదు. ఇది ఏ ప్రాంతంలో వుందో మనకు తెలీదు. ఇక్కడ మనకు ఎలాంటి ప్రమాదాలు ఎదురవుతాయో మనకు తెలీదు. అందువల్ల మనం అనుక్షణం ఎంతో జాగ్రత్తగా వుండాలి."

భారత్ అందరినీ హెచ్చరించాడు.

సరేనన్నట్టు తలలు వూపారు.

ముగ్గురు స్త్రీలు భయంగా ఒకరినొకరు చూసుకున్నారు.

అందులో ఒకామె "నా చెల్లికి ఆరోగ్యం సరిగా లేదని తెలిసి చూట్టానికి బయల్దేరాను. ఇప్పుడామెకు ఎలా వుందో? నాకోసం ఎదురుచూస్తూ వుంటుంది. కాని నేను ఈ దీవిలో ఇలా" ఆ తర్వాత ఆమెకు దుఃఖం ముంచుకు వచ్చింది.

"ప్లీజ్, డోంట్ క్రయ్....ఏడ్వకండి. ఏడుపు మనుషులను బలహీనపరుస్తుంది. ఇందుకు కారణం ఎవరయినా మనం పరిస్థితులను నిందిస్తూ బాధపడినందువల్ల ప్రయోజనం లేదు. జరగవలసిందేమిటో చూడాలి. ఇప్పుడు మనం ఆహారంకోసం వేట మొదలుపెట్టాలి. ఆకలితీరిన తర్వాత మిగిలిన కార్యక్రమం గురించి ఆలోచిద్దాం."

ఇలా అని ముందుగానే తనే అక్కడినించి కదిలింది స్టెల్లా.

మిగిలినవాళ్ళు ఆమెను అనుసరించారు.

వెచ్చని గాలి రివ్వుమని వీస్తూ వాళ్ళని బాధిస్తోంది. దానికి తోడుగా పైన ఎండవేడి, పెద్ద పెద్ద చెట్లు ఎక్కడో దూరంగా వున్నాయి.

దగ్గరగా వున్నవి అన్నీ పొదలే.

నడుస్తూనే అంతా ఆ పొదల్లోకి ఆత్రంగా చూస్తున్నారు. ఏవైనా చిన్న చిన్న జంతువులు దొరుకుతాయోమోనని.

అక్కడ దారి వున్నట్టుగా లేదు. మనుషుల అడుగు జాడలు ఇసుకలో ఎక్కడా కనపడటంలేదు. ఆ రాత్రి వర్షం కురియటంవల్ల తర్వాత ఎవరైనా ఆ ప్రాంతంలో నడిస్తే వాళ్ళ అడుగుల ముద్రలు స్పష్టంగానే కనపడేవి. కాని గాలికి పైకి తెరలు తెరలుగా లేస్తున్న ఇసుక ఆ అడుగుజాడలను చెరిపేసి వుండొచ్చు.

స్టెల్లా—భారత్‌ల వెనుక షాంకీల్ నడుస్తున్నాడు. అతడి మనసులో ఎలాంటి ఆలోచనలు వున్నాయో ఎవరికీ తెలీదు. కాని పైకి మాత్రం ఎంతో వినయంగా కనపడుతున్నాడు.

భారత్—స్టెల్లాతో మాట్లాడుతూ నడుస్తున్నాడు.

స్టెల్లా అతడి మాటలు వింటూనే ఓ కంట షాంకీల్‌ను కనిపెడుతోంది. దోపిడీ దొంగల్లో అంత సులభంగా మార్పురాదని ఆమె నమ్మకం.

వెనుక నడుస్తున్న మనుషులంతా వాళ్ళకు వచ్చిన కష్టం గురించి మాట్లాడుకుంటూ బాధపడుతున్నారు. ఒకరి కష్టసుఖాల గురించి మరొకరు చెప్పుకుంటున్నారు.

ఉన్నట్టుండి పక్కన ఎక్కడో తిరుగుతున్న చిన్న కుందేలు పరిగెత్తుకుంటూ వచ్చి అక్కడే వున్న చిన్న పొదలో దూరి అదృశ్యమయ్యింది.

దాన్ని పాంకీల్ చూడనే చూశాడు.

పొద దగ్గరకు వెళ్ళాడు.

అంతా అక్కడే ఆగిపోయారు.

"అది నీకు దొరుకుతుందా?" పెట్లా—పాంకీల్ ను అడిగింది.

"మీకే తెలుస్తుంది. పాంకీల్—కుందేళ్ళను పట్టుకోవటంలో ఆరి తేరినవాడు" అంటూ చేతుల్లో వున్న లగేజిని కింద పెట్టి చిన్న చిన్న ముక్కలను పక్కకు తీసుకుంటూ పొదలో దూరాడు. అతడి సూచనల ప్రకారం వాళ్ళంతా ఆ పొదచుట్టూ చేరారు.

పాంకీల్ నోటితో చిత్రమైన శబ్దాలు చేశాడు. పది నిమిషాల తర్వాత కుందేలు చెవులు పట్టుకుని విజయ గర్వంతో ఆ పొదలోనించి బయటకు వచ్చాడు.

అప్పటికప్పుడే ఎండిన పుల్లల్ని చేర్చి మంట చేసి ఆ కుందేలును మంటలో కాల్చారు. దాని మాంసాన్ని అంతా కొంచెం కొంచెంగా తినేశారు.

భలే రుచిగావుంది. కాని ఎవ్వరికీ ఆకలి తీరలేదు. నీళ్లు మాత్రం అక్కడ దొరకలేదు.

* * *

మళ్ళీ ఆహారంకోసం అన్వేషణ మొదలయింది. ఆశ్చర్యమేమిటంటే ఆ దీవిలో పండ్లున్న చెట్లు అప్పటివరకూ వాళ్ళకు కనపడలేదు.

అన్నీ ఒకేరకం చెట్లు. ఆకులు వెడల్పుగా వున్న ఎత్తుగా పెరిగిన చెట్లు.

కొంచెం మారం నడిచేసరికి ఆ ఎండలో వాళ్లు అలసిపోయారు. ఒక్కొక్కళ్ళు నీరసంగా అడుగులు వేస్తున్నారు.

వాళ్ళందరికీ భయమేసింది. ఆ దీవిలో అసలు ఆహారమే దొరకవా?

ఆహారం దొరక్క అలమటించి పోవలసిందేనా?

నాలుగు గంటలు కావస్తోంది.

అప్పుడే ఎండ వేడి క్రమంగా తగ్గుతున్నది.

ఒకరితో ఒకరు మాట్లాడుకోవటం ఆపేశారు. మాట్లాడుకుంటుంటే శక్తి నశిస్తోంది.

పాంకీల్ కు బాగా ఆకలివేస్తోంది. రెండు చేతుల్లో వున్న నూట్కేసులను మొయ్యలేకపోతున్నాడు. ఐనా తప్పదు మొయ్యక.

అక్కడినించి ఆ దీవి స్వరూపం మారిపోయినట్టు గ్రహించారు వాళ్ళు. అక్కడితో చిన్న పొదలు, ఎత్తుగా పెరిగే వెడల్పాటి ఆకులున్న చెట్లు అంతమయి పోయాయి.

ఇసుకలో తేమకూడా ఎక్కువగానే కనిపించింది అక్కడ. అక్కడినించి కొంచెం ఎత్తులో వున్న సన్నని ఆకులున్న చెట్లు దగ్గర దగ్గరగా నే కనిపించాయి.

చెట్ల కిందనించి నడుస్తూంటే నీడగా వుంది.

ఆ చెట్లమధ్యగా కొంచెం ఎత్తుగా పెరిగిన ఓ చెట్టును ముందుగా నెల్లా చూసింది. తర్వాత భారత్ — పాంకీల్ చూశారు.

ఇది మామిడి చెట్టులా వుంది—అనుకున్నాడు భారత్.

దానికి పైన ఎక్కడో గుత్తులు గుత్తులుగా ఎర్రగా పండిన పండ్లు కనిపించాయి. బహుశ ఆ పండ్లనుంచే నేమో

తియ్యని వాసన వస్తోంది.

అందరి దృష్టి ఆ చెట్టుమీద—పండ్లమీద పడింది.

వాళ్ళందరి ముహాంలో సంతోషం కదలాడింది.

"మై గాడ్....ఎన్ని పండ్లో ఈ దెబ్బతో మనందరి ఆకలి క్షణంలో తీరిపోతుంది" అన్నది సెల్లా.

"అవును. మన శ్రమ ఫలించింది. ఇక్కడినించి అన్నీ పండ్ల చెట్లే అనుకుంటూను. మనం ఆహారం గురించి దిగులు పడాల్సిన అవసరంలేదు. కావలసినన్ని పండ్లు. ఈ దీవి నించి బయటపడేవరకు మనం ఈ పండ్లు తినే ప్రాణాలు నిలుపుకోవచ్చు."

భారత్ అన్నాడు చేతిలో వున్న సూట్కేసు కింద పెట్టి.

అంతా ఎవరి చేతుల్లో వున్న బరువులను వాళ్ళు కింద పెట్టి తలలు పైకెత్తి చెట్టుని వున్న పండ్లకేసి ఆశగా చూశారు.

అప్పటికే షాంకీల్ చెట్టును ఎక్కే ప్రయత్నంలో వుండిపోయాడు. అలవాటులేని కారణంగానేమో పైకి ఎక్కటానికి కొంచెం శ్రమపడవలసి వచ్చింది.

"షాంకీల్ .... ఆలస్యం చెయ్యకు. ముందు చేతికి అందుబాటులో వున్న పండ్లని కోసి కిందపడెయ్యి" అన్నది సెల్లా.

పైనుంచి తల వూపాడు.

అతనికి దగ్గర్లో బాగా లావుగా వుండి ఎర్రగా పండి పోయిన పండు ఒక్కటే కనిపించింది. దాన్ని చూడటంతోనే షాంకీల్ ఆకలి వున్నట్టుండి రెట్టింపుగా పెరిగినట్లనిపించింది. ముందుగా తను గబగబా ఆ పండును తిని మిగిలిన పండ్లను కొయ్యాలనుకున్నాడు.

ఆ పండును తెంచాడు. మెత్తగా వుంది.

"షాంకీల్ .... దాన్ని కింద పడెయ్యి" భారత్ అన్నాడు.

"సారీ....ముందు ఈ పండును నేను తింటాను. నేను ఈ ఆకలిని భరించలేకుండా వున్నాను" అంటూ ఆ పండును కొరికి తిన్నాడు.

వెంటనే దాన్ని దూరంగా విసిరేశాడు "ఛీ" అంటూ.

అతడి చర్య కింద వున్న వాళ్ళకు అర్థంకాలేదు. ఆశ్చర్యం అనిపించింది.

"షాంకీల్, ఏమయ్యింది? ఎందుకా పండును అలా విసిరేశావ్?" అడిగింది సెల్లా.

సెల్లా ప్రశ్నకు షాంకీల్ జవాబు ఇవ్వలేదు. అతనికి తల తిరుగుతున్నట్టుగా అనిపించింది. నోరంతా చేదుగా ఐపోయింది. నాలుక పీక్కుపోతున్నట్టు నరాల్లోకి ఏదో జరజరా పాకుతున్నట్టుగానూ అనిపించింది.

అతనికి కళ్ళు తిరిగాయి.

రెండు చేతులతో గట్టిగా కొమ్మను పట్టుకున్నాడు. అయినా అతడి చేతులపట్టు జారిపోయింది. కళ్ళు మూతలు పడిపోయాయి.

ఒక్కసారిగా ఎవరో గట్టిగా నెట్టేసినట్టు కెవ్వుమంటూ అంత ఎత్తుమీదనించి కిందికి పడిపోయాడు.

పక్కకు తప్పుకున్నారు అంతా.

సెల్లా — భారత్ అతన్ని కిందపడకుండా పట్టుకోవాలని చూశారు కాని కుదర్లేదు.

బోర్లా పడిపోయాడు.

అతని చుట్టూ చేరారు.

"షాంకీల్! ఏం జరిగింది? ఎందుకలా పడిపోయావ్?"

భారత్ అడుగుతున్నాడు.

షాంకీల్ నోట్లోనించి నెత్తురుతో పాటు నురుగుకూడా వచ్చింది.

"ఆ పండ్లు తినకండి. అవన్నీ విషపూరితాలు" అంటూ తల వాల్చేశాడు షాంకీల్.

వాళ్ళంతా షాక్ కొట్టినట్టు అదిరిపడ్డారు అతని మాటలు విని.

భయంతో ఒకరినొకరు చూసుకున్నారు.

క్షణాల్లో షాంకీల్ శరీరం నల్లగా మారిపోయింది.

• • •

"థాంక్ గాడ్ ....మనందరం ఈ జన్మలో షాంకీల్ ఋణం తీర్చుకోలేము. అతను మనల్నందరినీ ఈ విషపూరితమైన పండ్లనించి రక్షించాడు. ముందుగా ఆ పండును అతను తిని మన ప్రాణాలను కాపాడాడు. అతనే ముందుగా పండ్లను కోసి కిందపడేసినట్లయితే మనందరం వాటిని ఆవురావురుమంటూ తిని ప్రాణాలు పోగొట్టుకునే వాళ్ళమే."

స్టెల్లా అన్నది బాధగా—

"అవును. మనందరం షాంకీల్ ను చంపాలనుకున్నాం. కాని చివరికి మనం చంపాలనుకున్న షాంకీల్ మనల్ని చావునించి బయటపడేశాడు. షాంకీల్ ఋణం తీర్చుకోలేనిది" అన్నాడు భారత్.

వాళ్ళంతా అచేతనులై వాళ్ళిద్దరి మాటలు వింటూ వుండిపోయారు. ఎందుకో వాళ్ళకు ఒక్కసారి ఎదురుగా వున్న చెట్లను, పొదలను పరిసరాలను చూస్తుంటే వెన్ను లోంచి ఏదో విచిత్రమైన భయం పుట్టుకుని వచ్చింది.

ఆ దీవి మొత్తాన్ని మృత్యువు ఆక్రమించుకుని వున్న

ట్టుగా అనిపించింది.

ఎర్రగా పండిన పండ్లు భయంకరమైన విషాన్ని నింపుకుని ఉన్నాయా?

ఏమిటీ చిత్రం!

ఇక ధైర్యంచేసి ఈ దీవిలో యే పండును తినాలి? యెలా ఆకలి తీర్చుకోవాలి?

ఆకలితోనే ఈ దీవిలో చావు తప్పదేమో!

అందరిలోనూ ఇదే రకమైన ఆలోచనలు.

షాంకీల్ ఆత్మశాంతికోసం వాళ్ళంతా కొంచెంసేపు మౌనం పాటించారు.

నోట్లోనించి నెత్తురు, నురుగు కారి తల ఓ పక్కగా పగిలిన షాంకీల్ శవం వికృతంగా అందరికీ భయాన్ని కలిగించేలా వుంది.

"ఈ శవాన్ని ఏం చేద్దాం?" స్టెల్లా అన్నది.

"ఇలా వదిలెయ్యటానికి వీల్లేదు. ఇక్కడే పూడ్చి వెయ్యాలి" భారత్ అన్నాడు.

"ఇప్పుడా? యెవరికి ఓపిక వుంది. తిండి, నీళ్ళు దొరక్క అలమటించిపోతూ ఇప్పుడు ఈ శవంకోసం గోతిని తివ్వే శక్తి ఎవరికి వుంది?" ముసలాయన అడిగాడు.

"ఓపిక వున్నా లేకపోయినా తప్పదు. ఈ మనిషి ఇప్పుడు ఓ కోపిడీ దొంగకాదు. మన ప్రాణాలు కాపాడిన మనిషి. అందుకే ఇలా వదిలెయ్యటానికి మేము ఒప్పుకోము. మీకు ఓపిక లేకపోతే మీరలా చెట్టు నీడన కూర్చోండి. నేను స్టెల్లా గొయ్యి తవ్వి ఈ శవాన్ని పూడ్చి పెడతాం."

భారత్ — స్టెల్లా అప్పటికప్పుడే కొంచెం యెత్తు తక్కువగా వున్న చెట్టుకొమ్మల్ని కొంచెం గట్టిగా వున్న

వాటిని విరుచుకు వచ్చారు.

అక్కడే గట్టి కర్రలతో గబగబా ఇసుకలో గొయ్యి తవ్వారు.

అరగంటలో మనిషి పట్టేంత గొయ్యి ఏర్పడింది. దాన్లో షాంకీల్ శవం ఉంచి క్షణాలమీద ఆ గొయ్యిని పూడ్చేశారు.

"ఇప్పుడు మనకు సేవకుడు లేడు. మనలో అప్పుడే ఓ మనిషి తగ్గిపోయాడు. ఈ దీవికి బలైపోయాడు" అన్నాడు భారత్.

అందరి హృదయాలూ భారంగా ఐపోయాయి.

ఒక్కసారి పూడ్చిన గొయ్యిని చూసి మళ్ళీ అక్కడి నించి కదిలారు.

* * *

"ఎంతదూరం ఈ ప్రయాణం?" ఎవరో అడిగారు.

"ఏమో! తెలీదు. ముందు మన ఆకలి, దప్పిక తీరాలి. ఆ తర్వాతనే మిగిలిన విషయాల గురించి ఆలోచించటం. ఆకలితో నీరసంతో కళ్ళు తిరుగుతున్నాయి. ఇలాగైతే ఎక్కువ దూరం మనం నడవలేము" ఇంకెవరో అన్నారు.

అప్పటికే ఎండ చాలావరకు తగ్గిపోయి క్రమంగా నల్లని నీడలు యెక్కడినించో వచ్చి ఆ దీవిని చుట్టుకుంటున్నాయి.

అప్పటిదాకా వేడిగా వీచిన గాలి నిముషాలమీద చల్లగా చలిగాలిగా మారిపోయింది.

"చీకటి పడకముందు మనం ఈ ఆకలిబాధలు తీర్చుకోగలమా?"

"ఏమో? నమ్మకం లేదు. ఇదేదో చాలా ఘోరమయిన దీవిలా వుంది. ఇలాంటి దీవులు కూడా వుంటా

యని నేను ఎప్పుడూ విన్లేదు" ఓ యువకుడిలా వున్నతను అన్నాడు.

"దయచేసి ఎక్కువగా మాట్లాడకండి. మన శక్తి వృధా అవుతుంది. మౌనంగా నడవండి" భారత్ అన్నాడు.

అప్పుడే కొంచెం దూరంనించి వున్నట్టుండి యేవో పక్షులు గుంపులుగా పైకి లేచి ఆకాశంలో అరుస్తూ ఎగిరి పోతూ కనిపించాయి.

ఆ వైపునించే సరిగ్గా చల్లగా వున్న గాలి ఒక్కసారి వీచింది.

శైలా సంతోషంగా అన్నది.

"మనకు దగ్గర్లోనే యేదో జలాశయం వుంది. ఆ ఎగిరి పోయిన పక్షులు, ఈ చల్లని గాలి అందుకు నిదర్శనాలు."

అందర్లో ఒక్కసారి ఆశ కలిగింది.

నీరసించిపోతున్న శక్తిని కూడగట్టుకుంటూ గబగబా ముందుకు నడిచారు.

పదినిముషాలు నడిచేసరికి దట్టంగా చెట్లు వున్న ప్రాంతం వారికి కనపడింది. ఆ చెట్ల మధ్యగా చిన్న నీటి మడుగు దర్శనమిచ్చింది.

అందులో నీళ్ళు స్వచ్ఛంగా వున్నాయి.

ఒడ్డునే రంగు రంగుల పక్షులు నీళ్ళు తాగుతూ కనపడ్డాయి.

ఆ నీళ్ళను చూడగానే అందరి కళ్ళు సంతోషంతో మెరిశాయి.

"నీళ్ళు....నీళ్ళు" అంటూ అరిచారు కొందరు.

చేతుల్లో వున్న బరువులను ఒడ్డునే వదిలి రివ్వున నీటి దగ్గరకు పరుగుదీశారు. పరుగుతీసి ఎవరో పట్టి ఆపినట్టు

తక్కన ఆగిపోయారు.

"ఆగిపోయారేం?" అన్నది స్టెల్లా వాళ్ళ దగ్గరకు వెళుతూ—

"భయంగా వుంది. ఈ నీళ్ళు తాగితే ప్రాణాలు పోవు కదా?!"

స్టెల్లా నవ్వి "అలాంటి భయం అవసరం లేదనుకుంటాను. ఎందుకంటే అటు చూడండి. ఆ పక్షులు నీళ్ళు తాగుతున్నాయి. మనమూ తాగొచ్చు" అంటూనే వంగి దోసిలితో నీళ్ళు తీసుకుని నోట్లో పోసుకుంది.

"ఎక్సలెంట్. అద్భుతంగా వున్నాయి నీళ్ళు...." అన్నది ఇంకా తాగుతూ—

అంతే. క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా అంతా నీళ్ళమీద దాడి చేశారు. ఆకలిబాధ తీర్చుకోటానికి ఆహారం బదులు కూడా నీళ్ళనే తాగారు. నీటిని వంటి నిండా చల్లుకున్నారు.

కొంతమంది స్నానాలు చెయ్యటానికి సిద్ధమయ్యారు. కాని భారత్ వద్దన్నాడు.

"చీకటి పడుతోంది. ఈ నీటిమడుగు దగ్గరకు ఏమయినా క్రూరమృగాలు రావొచ్చు. అంతే కాదు. ఈ రాత్రి గడపటానికి మనం సురక్షితమయిన ప్రదేశాన్ని వెతుక్కోవాలి. అందువల్ల యిప్పుడు స్నానాలు వద్దు."

మడుగు గట్టున వున్న చెట్లకు చిన్న చిన్న పండ్లు వేలాడుతున్నాయి.

"ఈ పళ్లను తినవచ్చునేమో" అన్నాడు భారత్.

"వద్దు. ఈ దీవిలో పండ్లన్నీ విషపూరితాలేమో" ఎవరో అన్నారు.

"అలా భయపడితే ఆకలితోనే మనం ఈ దీవిలో చచ్చిపోతాం.... చూడండి.... కొన్ని పళ్ళను పక్షులు సగం తిని వదిలేశాయి. కొన్ని పండ్లను పక్షులు తింటున్నాయి. సందేహంలేదు. ఈ పండ్లు విషపూరితాలు కాదు" అంటూ కింద పడివున్న ఓ పండును తీసుకుని కొరకబోయింది.

"వద్దు.... వద్దు" అరిచారు ఎవరో.

స్టెల్లా నవ్వి "ఎవరో ఒకరు సాహసం చెయ్యాలి. తప్పదు. ఆ సాహసాన్ని నేనే చేస్తాను"అని ఆ పండును కొరికింది.

తియ్యగా వుంది ఆ పండు.

అంతా స్టెల్లా మొహంలోకి చూస్తున్నారు.

"ఎలా వుంది?"

"డామ్ స్వీట్" నవ్వింది.

"నే నడిగేది రిజల్టు" భారత్ అన్నాడు.

"ఎలాగూ లేదు. మామూలుగానే వుంది. ఇవి మంచి పళ్ళే. అంతా తినండి" అన్నది ఆ పండును పూర్తిగా తింటూ.

అంతే. అంతా కిందికి వాలిన కొమ్మలను పట్టుకుని మరింత కిందికి లాగి వాటికి వేలాడుతున్న పండ్లను గబగబా కోసుకు తిన్నారు.

క్షణాలమీద చేతికి అందిన పండ్లన్నింటినీ అవురావురుమంటూ తినేశారు. ఎన్ని పండ్లు తిన్నారో వాళ్ళకే తెలీదు.

ఆ గొడవల్లో చీకటి పడటాన్ని గమనించనే లేదు. ముందుగా స్టెల్లా గమనించింది.

"క్విక్ ...., ముందు మనం యిక్కడినించి బయల్దేరాలి.

సురక్షితమయిన ప్రదేశాన్ని సెర్చ్ చెయ్యాలి" అన్నది.

సెకన్లలో వాళ్ళు అక్కడినించి కదిలారు.

ఆ చెట్లు దాటి బయటకు వచ్చిన తర్వాత "ఇప్పుడు మనం యెటు వెళ్ళాలో యెలా తెలుస్తుంది?" అన్నాడు భారత్.

"తెలీదు. కానీ ఏదో ఓ వైపు నడవాలి. ఈ చెట్ల దగ్గరే ఈ రాత్రికి మనం గడపొచ్చు. కాని ఇక్కడ నీటి మడుగు వుంది. క్రూర జంతువులు తప్పకుండా యిక్కడికి వస్తాయి. అందువల్ల మనకు ప్రమాదం. కాబట్టి మనం యిక్కడినించి దూరంగా వెళ్ళక తప్పదు" అన్నది సెల్లా.

"ఐతే ఎటు వెళదాం? మన విమానం కూలిపోయిన ప్రదేశానికే వెళదామా?"

"ఎందుకు?"

"అక్కడే సురక్షితంగా వుంటుందని నా నమ్మకం. ఎందుకంటే ఈ రాత్రికి మనం కూలిపోయిన ప్లేన్‌లో తల దాచుకోవచ్చు. ఈ రాత్రి ఎలాగో గడిపామంటే తెల్లారినతర్వాత ఈ దీవిలో తిరిగి మనం ఇక్కడినించి ఎలా బయటపడాలో తెలుసుకోవచ్చు" అన్నాడు భారత్.

అంతా అందుకు అంగీకరించారు.

సగం కాలిపోయి కూలిపోయిన విమానం కంటే ఆ రాత్రి తల దాచుకోటానికి మంచి ప్రదేశం యేదీ లేదని అంతా ఒప్పుకున్నారు.

తెలిసున్న దారే కాబట్టి వేగంగా నడవటం మొదలు పెట్టారు.

సెల్లా ముందు నడుస్తోంది. వెనుకనే భారత్ వున్నాడు. అతడి వెనుక మిగిలినవాళ్ళంతా వున్నారు.

సెల్లా తాను అంతకుముందు వచ్చిన అడుగుజాడలను చూసుకుంటూ నడుస్తోంది. చీకట్లు అలుముకోవటంవల్ల అడుగు జాడలు అంత స్పష్టంగా కనిపించటం లేదు.

ఐనా ప్రయత్నం చేస్తోంది.

వెడల్పాటి ఆకులున్న చెట్లు వచ్చాయి.

అప్పుడే వాళ్ళు షాంకీల్‌ను బలిగొన్న విషపండ్ల చెట్లను దాటారు. అక్కడికి రాగానే అందరికీ ఒళ్ళు ఒక్కసారి జలదరించింది.

నడుస్తున్నదల్లా సెల్లా ఠక్కున ఆగిపోయింది.

* * *

“ఏమయ్యింది?” ఆగిపోతూ అడిగాడు భారత్.

“నీ లైటర్ ఇలా ఇవ్వు.”

ఇచ్చాడు.

సెల్లా దాన్ని వెలిగించి వంగి నేలమీద పరీక్షగా చూసింది. క్షణం తర్వాత “మై గాడ్, ఈ దీవిలో మనమే కాకుండా మరికొంతమంది మనుషులు వున్నారు” అన్నది.

“నిజమా!” అంతా ఒక్కసారి అన్నారు.

“అవును. అంతేకాదు. వాళ్ళు మనకంటే భారీ మనుషులు. కావాలంటే ఈ అడుగుజాడలు చూడండి.”

అంతా ముందుకు వంగారు.

వాళ్ళకు ఇసుకలో కొంచెం దిగబడినట్లుగా వున్న రెండు పెద్ద వెడల్పాగా వున్న పాదాల ముద్రలు కనిపించాయి.

అంతా భయంతో నోరు తెరిచారు.

“జాగ్రత్తగా వినండి. మనం వెళ్ళిన తర్వాత ఈ ప్రాంతంలో ఆ మనుషులు తిరిగారు. బహుశ మన అడుగు

జాడలను వాళ్ళు పసికట్టి వుండాలి. అంటే వాళ్ళు మనలను వెంటాడుతూ వుండొచ్చు. అంటే ప్రమాదం మన వెనుకే వుంది. దీవుల్లో మనుషులంటే చాలావరకు నాగరిక మనుషులకు హాని చేసేవాళ్ళే ఐవుంటారు. కాబట్టి మనందరం వెయ్యి కళ్ళతో సంచరించాలి...." అంటూ చెబుతున్నదల్లా ఒక్కసారి ఆగిపోయింది సెల్లా.

ఏదో ఘాటయిన వెగటు వాసన ఆమె ముక్కుపుటాలను తాకింది.

గట్టిగా ఒక్కసారి గాలిపీల్చి యెందుకో తలెత్తి చుట్టూ చూసి అదిరిపడింది.

వాళ్ళెవ్వరూ గమనించలేదు.

"మై గాడ్" అని సెల్లా అనటంతో చూశారు.

అప్పటికే ఓ పాతికమంది దీవి మనుషులు వాళ్ళని చుట్టుముట్టారు. ఒకరిద్దరి చేతుల్లో అప్పటికప్పుడే కాగడాలు వెలిగాయి.

ఆ వెలుతుర్లో యమదూతల్లా వున్న వాళ్ళందరినీ చూడటంతోనే అంతా కొయ్యబారిపోయారు. పై ప్రాణాలు పైనే పోయాయి.

నల్లగా పోతపోసిన విగ్రహాల్లా వున్నారు. చింపిరి జుట్టు దానిచుట్టూ తోలు రిబ్బనులాంటిది చుట్టుకున్నారు. ఎర్రగా వున్న కళ్ళు—చప్పిడి ముక్కులు — బాగా పొడుగ్గా వున్న నోర్లు—

మొలచుట్టూ ఏదో జంతు చర్మాన్ని చుట్టుకున్నారు. అరటిబోదెల్లాంటి కాళ్ళు—వెడల్పుగా వున్న పాదాలు బాగా ఎత్తుగా—లావుగా భయంకరంగా ఉన్నారు. వాళ్ళందరి చేతుల్లోనూ పొడుగాటి ఈటెలు ఉన్నాయి.

స్త్రీలు కెవ్వున అరవబోయారు కాని భయంతో

అరుపు బయటకు రాలేదు.

భారత్ కు కూడా వాళ్ళను చూడటంతో నే ప్రాణాల మీద ఆశపోయింది. అలాంటి అనాగరిక మానవులు నాగరిక మనుషులు దొరికితే ప్రాణాలతో వదలక పోవచ్చు.

అంతా శిలల్లా నిలబడిపోయారు. కదలికలు లేకుండా-చివరకు గాలి పీల్చటం, వదలటంకూడా మరచిపోయారు.

ఏం చెయ్యాలి?

ఆ మనుషుల బారినించి తప్పించుకోవటం సాధ్యమేనా? సాధ్యం అవకపోవచ్చు.

వాళ్ళు చాలామంది వున్నారు. వాళ్ళందరి దగ్గర ఈటెలు వున్నాయి. పైనా ముందుగా వాళ్ళ గురించి ఏమీ తెలియకుండా ప్రతిఘటనకు పూనుకోవటం అవివేకమేమో!

భారత్ ఆలోచనలు ఇలా వుండగానే ఆ పాతిక మంది వాళ్ళలో వాళ్ళే కిచకిచలాడుకున్నారు. ఆ భాష యేమిటో అక్కడ వున్న యెవ్వరికీ అంతుబట్టలేదు.

తర్వాత పొడుగాటి పళ్ళని బయటపెట్టి వికృతంగా నవ్వుతూ ఈటెలతో—శూగడాలతో ముందుకు వచ్చారు.

అప్పుడే ఊహించని విధంగా—

ముగ్గురు స్త్రీలు గుండెలు పగిలేలా ఆర్తనాదాలు చేశారు.

•　　　•　　　•

ఆ షాక్ నించి ముందుగా స్టెల్లా తేరుకొని వెంటనే రియాక్ట్ అయ్యింది. పర్సులోనించి రివాల్వర్ బయటకు లాగబోయింది.

ఆమె చర్యను కనిపెట్టిన భారత్ "స్టెల్లా....తొందర

పడకు....ప్రతిఘటన క్షేమంకాదు" అన్నాడు.

వెంటనే తన ప్రయత్నాన్ని ఆపుచేసింది.

ఐతే అప్పటికే వాళ్ళు ఏదో కనిపెట్టినట్టు మళ్ళీ నవ్వారు.

నవ్వుతూనే మళ్ళీ కిచకిచలాడారు.

ఆ కిచకిచలు వాళ్ళకు ఎంతమాత్రం అర్థంకాలేదు. వాళ్ళు అప్పటికి తెలుసుకున్నట్టు భయపడవద్దన్నట్టు సైగచేసి శత్రువులంకాదు మిత్రులమే అన్నట్టు రెండు చేతులనూ ఒకదానికొకటి కలిపి చూపించారు.

భారత్ కు సెల్లాకు వాళ్ళ సైగలు బాగానే అర్థం అయ్యాయి. అప్పుడు వాళ్ళు మిగిలిన వాళ్ళకు ఆ విష యాన్ని వివరించి చెప్పారు.

అంతా హాయిగా నిర్భయంగా గాలి పీల్చుకున్నారు.

వాళ్ళు సైగలతోనే "మీరంతా ఎవరు?" అని అడిగారు.

అందుకు భారత్ కొంచెం దూరంలో వున్న కూలి పోయిన విమానం దిక్కు చూపుతూ దాన్లో ఈ దీవిలోకి వచ్చి పడ్డామని సైగలతోనే చెప్పాడు.

అందుకు వాళ్ళలో వాళ్ళే కిచకిచలాడుతూ యేదో మాట్లాడుకుని "మాతో రండి" అంటూ సైగ చేశారు.

"వెళ్ళక తప్పదా?" అన్నది సెల్లా.

ఆ మెకు ఆ ఆటవిక జాతులతో కలిసి వాళ్ళ గూడానికి వెళ్ళటం ఇష్టంలేదు. వాళ్ళ దగ్గరనించి కొడుతున్న ఆ వెగటు వాసనకే తల తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. వాళ్ళ వల్ల యేమంత ప్రమాదంలేదని అనుకున్నా అక్కడకు వెళ్ళటం యెందుకో సెల్లాకు మనస్కరించలేదు.

కాని "తప్పదు సెల్లా. ప్రస్తుతానికి మనం ఈ మను

షులను అనుసరించక తప్పదు. వీళ్ళ సహాయంతో నే మనం ఈ దీవినించి బయటపడే మార్గాన్ని తెలుసుకోవాలి. నిజంగా మన అదృష్టం వీళ్ళంతా మంచివాళ్లు కావటం నేను ఎన్నో పుస్తకాల్లో చదివాను. ఇలాంటి దీవుల్లో ఉండే జాతి మనుషుల్లో చాలావరకు నరమాంస భక్షకులే. మిగిలిన వాళ్లు నరమాంసం తినకపోయినా నాగరిక మనుషులను ప్రాణాలతో వదలరు. ఇప్పుడు మనకు అలాంటి భయంలేదు. ధైర్యంగా వీళ్ళతో వెళ్ళవచ్చు" అన్నాడు భారత్.

"వెళ్ళొచ్చు నిజమే భారత్. కాని వాళ్ళదగ్గరనించి వస్తున్న ఆ వెగటు వాసనను నేను భరించలేకుండా ఉన్నాను."

నవ్వాడు అతను చిన్నగా—

నవ్వి "ఒక్కోసారి యెలాంటి వెగటువాసనైనా భరించాలి స్టెల్లా. నిజానికి నాకూ ఈ వాసనను భరించటం కష్టంగానే వుంది. ఐనా తప్పదు. ప్రస్తుతం మనం ఎలాంటి క్లిష్టమైన స్థితిలో ఉన్నామో గుర్తుచేసుకో" అన్నాడు.

స్టెల్లా మాట్లాడలేదు.

"పదండి" అన్నట్టు సైగచేశాడు భారత్.

వాళ్ళు వెనక్కి తిరిగారు.

చేతిలో కాగడా ఉన్న మనిషి ముందు నడుస్తున్నాడు. మరో కాగడా ఉన్న మనిషి చివరగా నడుస్తున్నాడు. మధ్యలో భారత్—స్టెల్లా మిగిలిన వాళ్ళంతా ఉన్నారు.

మిగిలిన అందరికీ మనసులో ఏదో భయంగా ఉంది.

ఈ దీవిలో అటవికుల మధ్య ఏమిటీ నడక?

కలలోకూడా వూహించని పరిణితి.

ఒక్కొక్కరికీ మనసులో యెంతో దిగులుగా ఉంది. ఒకరకంగా ఈ దీవిలో చిక్కుపడిపోయినట్లే.

తిరిగి ఈ దీవినించి విముక్తి ఎప్పుడు? అసలు విముక్తి అనేది ఉంటుందా?

ఓ పొద పక్కనించి దారి మారింది. అది కొత్తదారి. ఆ దారి ఆ మధ్యాహ్నం వాళ్ళకు కనిపించలేదు. లేకపోతే ఆ దారిలోనే ప్రయాణం చేసేవాళ్ళు. అప్పుడే ఆ ఆటవికుల గూడేనికి చేరేవాళ్ళు.

దారి పొడుగునా వాళ్ళుకూడా ఏమీ మాట్లాడలేదు. సన్నని కాలిబాట పొదల మధ్యనించి ఉంది. ఆ పొదల మధ్యనించి నడుస్తుంటే చిన్న చిన్న ముళ్ళు గీసుకుపోతున్నాయి. బట్టలు చీరుకుపోతున్నాయి.

భయంగా వుంది. ఆ చీకట్లో యే పొదలోనించి యే జంతువువచ్చి మీద పడుతుందోనని.... అప్పటివరకూ ఆ దీవిలో ఒక్క జంతువుకూడా కనపడలేదు—ఆ కుందేలు తప్ప.

ఆ దీవిలో క్రూరజంతువు లేవేల?

అడగాలని ఉంది భారత్‌కి వాళ్ళను.

కాని వాళ్ళ భాష రాదు. యెలా అడగాలో తెలీదు. గూడేనికి వెళ్ళిన తర్వాత యేదోవిధంగా తన సందేహాలను తీర్చుకోవాలి.

అతనా ఆలోచనల్లో ఉన్నప్పుడే సెల్లా చిన్నగా అతడిని పిల్చింది.

"ఏమిటి?"

"ఈ అడవిమనుషులకు వజ్రాల గురించి తెలుసా?"

"ఎందుకు?"

"నీ దగ్గర ఉన్న వజ్రాలను చూశారంటే వీళ్ళు వదులుతారా?"

ఉలిక్కిపడ్డాడు భారత్.

అవును. ఇప్పటిదాకా తనకు ఆ అనుమానమే రాలేదు. యీ దీవిలో ఉండే మనుషులకైనా వజ్రాలగురించి తెలీకుండా ఉంటుందా?

తెలిసే ఉంటుంది. అలాంటప్పుడు ఈ మనుషులబారినించి ఆ వజ్రాలను దాచటం ఎలా?

"మాట్లాడవేం?"

"ఇప్పుడేమీ చెప్పలేను. ఏమయినా ఇబ్బందే. నువ్వేదయినా ప్లాను ఆలోచించు."

సెల్లా మౌనం వహించింది.

పొదలు అంతరించిపోయాయి. పొడుగ్గా ఉన్న చెట్లు మొదలైనాయి. ఆ చెట్ల మధ్యనించి వాళ్ళందరికీ ఎర్రటి రంగులో ఉన్న ఏదో దేదీప్యమైన కాంతి కనపడింది.

ఎన్నో ఇళ్ళు ఒక్కసారిగా కలిసి అగ్నికి ఆహుతి అవుతుంటే అటువంటి కాంతి వస్తుంది.

భారత్ — సెల్లా ముందుగా ఆ వైపు చూసి మిగిలిన వాళ్ళందరికీ ఆ వెలుగు గురించి చెప్పారు. అంతా చెట్ల మధ్యనించి ప్రసరిస్తున్న ఆ కాంతిని చూసి వాళ్ళు ఆశ్చర్యంతో మునిగిపోయారు.

ఉదయిస్తున్న సూర్యుడి కిరణాల తేజస్సులా ఉంది అది. రాత్రివేళ ఆ వెలుగు యెక్కడినుండి వస్తోంది.

ఆ దీవిలో అంత ఎత్తునుండి అలాంటి తేజస్సును వెదజల్లే దీపాలు ఉండటం సాధ్యమేనా?

నడుస్తున్నకొద్దీ ఆ కాంతికి దగ్గరవుతున్నట్టుగా వాళ్ళు గ్రహించారు.

"స్టెల్లా ఆ వెలుగు యేడైదే ఉంటుంది?"

"ఆశ్చర్యంగా ఉంది. నాకు అంతుపట్టటంలేదు. యెన్నో విద్యుత్ లైట్లను ఫోకస్ చేస్తేగానీ అలాంటి వెలుగు రాదు" అన్నది.

"గూడెంలో ఇళ్ళు తగలబడుతున్నాయేమో?"

నవ్వింది స్టెల్లా.

"నీ బ్రెయిన్ సరిగా వర్క్ చెయ్యటం లేదను కుంటాను. గూడెంలో ఇళ్ళు తగలబడుతుంటే ఈ మనుషులు మనముందు ఇలా నడుస్తారా? పరుగులు పెట్టి ఉండేవాళ్ళు ...ఆ వెలుగు ఈ మనుషులకు బాగా అల వాటైనదిలాగే అనిపిస్తోంది. అందుకే దాన్ని గురించి యెలాంటి ఆదుర్దా లేకుండా తాపీగా నడుస్తున్నారు."

"అవును. నువ్వు చెప్పింది నిజం."

మిగిలిన మనుషులుకూడా ఆ వెలుగు గురించి వాళ్ళలో వాళ్ళు చర్చించుకున్నారు.

చివరకు భారత్ ఆ సస్పెన్స్‌ను భరించలేక తన ముందు నడుస్తున్న ఆ జాతి మనిషిని పిల్చి చేత్తో ఆ వెలుగు వైపుకు చూపించి అదేమిటని అడిగాడు సైగ తోనే.

వాడు చెప్పలేదు.

నవ్వి వూరుకున్నాడు. వాడి నవ్వు మరీ వికృతంగా ఉంది. నవ్వినప్పుడు వాడి నోట్లో' ఉన్న పళ్ళు ఆ వెలుగులో వంకరటింకరగా పొడుగ్గా కనపడినాయి.

గూడేనికి దగ్గరవుతున్నప్పుడు వాళ్ళు మళ్ళీ కిచకిచ లాడుకోవటం మొదలుపెట్టారు.

చెట్లన్నింటినీ దాటేశారు.

(సశేషం)